## పెన్నేటి కతలు

**- రామకృష్ణారెడ్డి**

ఆయినకు రోంతకాలుకుంటుండెగానీ, మనిషి మల్లా ఎత్తూ లావూ బాగనే వుండె. కుడికాలు మోకాలు కింద నుంచీ కింది దాంకా ఎందుకో సనిసి 1 పోయింది. అందుకని, నడ్సేటప్పుడు కట్టె ఊదపాడ్సుకుంటా 2 నడ్సేవాడు. కట్టుకునేవోల్లె కంటే నెత్తికి సుట్టుకునే రుమాలే 3 పెద్దది. మనిషి నల్లటోడు, ఎప్పుడూ రోంత పిల్లిగడ్డం వుండేది. ఊల్లో ఆయనంత తెల్లగుడ్డ లేసుకునేవాళ్ళు అప్పటికెవుర్లేరు. ఆయన ఏం సదివి, ఎట్టెట్ట సదువుజెప్పే అయ్యవారయినారోగానీ, సన బాసే సరిగా మాట్లాల్లేడే, సదువెట్ట జెప్తాడబ్బా... అని శానామందే అనుకొని.

ఒక్కాట్లు ఒకటే, రెండుకాట్లు రెండూ అని ఎక్కాలు సెప్పడానికీ, ఎప్పుడూ ఎట్టుండేటియో అట్టుండే ఓనమాలు సెప్పడానికీ ఎంత బాస రావాల్లే, అని అవతల తెల్సిపాయె. సదువు జెప్పడానికాయినేమీ నావు జంపులు నన్నట్టు లేదుగానీ, మాట్లాడ్డంలోనే పాపం... బాగా యాతనపడిపాయె. అందరూ ఆయిన్ని 'తురకయ్యవారు' అనీ, 'కుంటెయ్యవారు' అనీ అనే వాళ్ళు. పిల్లా జెల్లా కల్సి అంతా ఎంతమంది వుండేవాళ్ళో యెవురికీ తెల్దు. అయ్యవార్నడిగినా... రుమాల తీసి నెత్తిగోక్కుంటా, ఏక్... దో... తీన్ అని ఎంచుకోని గానీ సెప్పలేకపోయేవాడు. పిల్లోళ్ళుగాక యింగా యెవురో ఆడోళ్ళుండేవాళ్ళు.

అప్పుడు ఊళ్ళల్లో ఇండ్లకు బాడిగుండేది కాదు. ఇంట్లో కసపూడ్సుకోంటా, దీపం పెడ్తే సాలుకోనే వాళ్ళు. అందువల్ల అయ్యవారు కాపరం వుండడానికి పెద్ద యిండ్లే దొరికింది. అప్పుడు ఆయినకు జీతం ఎంత వచ్చేదో తెల్దుగానీ, వాళ్ళ బువ్వకు సాలేది గాదని తెల్సిపోయేది. అయ్యవారు తెల్లగుడ్డలేసుకోని, తెల్ల రుమాల పెట్టుకోని బడికి పోతా వస్తా వుండెగానీ, ఇంట్లో ఆడపిల్లలకూ, మొగపిల్లోళ్ళకూ కట్టుకోను గుడ్డలే వుండేటియికావు. ఎప్పుడూ బయటికి వచ్చే వాళ్ళు కాదు గాబట్టే అందరికీ తెల్సేది కాదు. అదే యింగెవరన్నా అయితే ఊల్లో వున్నోళ్ళ కాడికిపోయి పాత గుడ్డలడుక్కోని తెచ్చుకొనేవాళ్ళు. అయ్యవారి పిల్లోళ్ళు అయినందువల్ల ఆ పని సేయల్యాకపాయిరి. సేన్లకో, ఇండ్ల కాడికో పనులకూ పోల్యాకపాయిరి.

ఊల్లో యింగా సాయిబూ లుండారుగానీ, వాళ్ళ పిల్లోళ్ళు కలుపులు తీయనో, కాయలేరనో ఇట్టాటి పనులకు పోతావుంటారు. సాయిబూలూ, మిగిల్న కులాలోళ్ళూ వరసలు కలుపుకోని, అత్తా, అక్కా, మామా అంట ఒకర్నొకరు పిల్సుకోంటావుంటారు. ఊళ్ళల్లో పనిపాటల్లో కల్సేవాళ్ళకు వుండే సనుందాలు కల్వనోళ్ళకు వుండవు. అందువల్ల, అయ్యవారి సంసారాన్ని అందరూ రోంత దూరంగా వుండి సూసినట్టు సూసేవాళ్ళు. పనులకు పోవడం అట్టా వుండనిచ్చి ... బూబమ్మ ఏటికి బోయి మంచినీళ్ళు కూడా తెచ్చుకోల్యాకపాయె. పగలు పోడానికి గోసా అయిపాయె, రాత్రి పోడానికి సీకటైపాయె.

అయ్యవారే బడి మంచి వచ్చినాక ఏటికి బోయి కడవతో నీళ్ళు తెచ్చుకోవాల్సివచ్చేది. ఒక సేత కట్టె బట్టుకోని, బుజం మీద కడవ బెట్టుకోని, నీళ్ళు తెచ్చుకొనే అయ్యవార్ని సూసి ఊల్లో పెద్దోళ్ళు 'ఒరెరే...!' అనుకోని, ఆ పనికి బడిపిల్లోళ్ళను పురమాయిచ్చినారు. పోసుకోడానికింగ తావు లేదు మొర్రోమని బూబమ్మ మొత్తుకొనేదాంకా బడిపిల్లోళ్ళు పరుగెత్తి పరుగెత్తి నీళ్ళు మోయబట్టిరి. ఏట్లో నీళ్ళా, తేవడానికి పిల్లోళ్ళూ వుండేదాన, అయ్యవారి సంసారానికి నీళ్ళ

## ఆకలి గురువులు

కరువు తీరెగానీ తిండి కరువు అట్టాటిది గాదే. ఎన్ని మాట్లు నీళ్ళు తాగినా రోజా కొకపారన్నా బువ్వ తినాలగదా.

రోజా అయ్యవారింట్లో కొట్టుకోడాలు, తిట్టుకోడాలు, ఏడ్పులు అందరికీ యినపడ్తానే వుండె. ఒక పొద్దైతే... ఆయన బడికి పోడానికి తయారయినట్టుంది.. అప్పుడు సడిందబ్బా కొట్లాట. ఆయన కట్టె తీసుకోని బూబమ్మను బాగ కొట్నట్టుంది. ఆమె లోపలింట్లో పాపం... ఓ... అంటా శోకాలు తీస్తాంది. సూస్తా వుండిన ఇరుగూ పొరుగూ, "ఎందుకు బూబమ్మను అట్ట కొడ్తావుండావ"ని అడగల్యాకపాయిరి. ఆయన బడికి పోడానికి రెండడుగులేసి, ఏమనుకొన్నాడో ఆడోళ్ళ దిక్కు తిరిగి "అది లంజా అమ్మా!" అని యింట్లో వున్న పెండ్లాం దిక్కు కట్టె ఎత్తి సూపె. తీరా మాట అన్నాక, పెండ్లాన్ని తప్పు మాట అన్నట్టు ఆయినకు అర్థమయింది. "లంజా అంటే అట్టలంజా కాదు, అదేంది అమ్మా నోటికి రాదూ, ఆ... నోటి లంజ" అని యివరిచ్చినాడు. 'కొట్లాట మారి' అని సెప్పడానికి ఆయిన ఆ పెద్ద మాట అన్నట్టు తెల్సినాక... కొందరు నగిరి, కొందరు నగల్యాకపాయిరి. పెండ్లాల్ను ఆ మాటతోనే తిట్టేవాళ్ళున్నప్పుడు, ఆయిన తెలక నోరు జార్నాడులే... అని అందరూ అనుకొని.

యిత్తనాలప్పుడు ఇండ్లల్లో కూకునే సెనిక్కాయలు వొల్సి సంగటి గింజలు సంపాయిచ్చుకోనన్ను. కడింట ఎంగటపతి వొల్సండని అయ్యవారింట్లో కాయల మూటేసి, సడికి సెటాకు లెక్కన యిత్తనాలు తగ్గి వాయని లబోదిబోమనె. ఆయన్న అసలే బంకోడు 4. ఇత్తనాలు ఇంట్లో అందరూ బొక్కులాడి 5 నారని, కారెం గూడా నేసుకొన్నారని... యిట్ట రచ్చజేసె. అయ్యవారన్న గౌరవం మాటమని ఆ యిన్ను అంతా మందలిచ్చి నోరు మూయిచ్చిరి. అయితే, ఆ యిన్ను మందలిచ్చిరే కానీ పిరెంకాయిలయినందువల్ల, మల్లె వురూ వొల్సమని అయ్యవారింట్లో కాయలు పోయల్యాకపాయిరి. ఇదెందుకు సెప్తినంటే... ఆకలికి గౌరవం తెల్దనడానికి. 'పరుల సొమ్ము తాకరాదు' అని అయ్యవారు పిల్లోళ్ళకు నీతి సెప్తే మాత్రం, అది కుదుర్తాదా? అనడానికి.

ఇంగ అయ్యవారి సంగతి జెప్పాల్నంటే... కడుపులో ఎట్టనో వుంటాది. పిల్లోళ్ళకు సదువు జెప్పడం కంటే ఎక్కువగా ఎప్పుడూ యియ్యే అడుగుతావుండేవాడు. ఒక్కొక్క పిల్లోన్నే లేపి... 'ఏం తినొచ్చినావు?' అని అడిగేవాడు. "సద్దెన్నమా? వరి బువ్వేనా? గడ్డ పెరుగేసుకోలేదూ? కడుపు నిండా బాగా మెక్కి వచ్చినావన్న మాట..." ఇట్టా. పండగలప్పుడైతే పతేకంగా పెశ్నలు. "ఉగాదికి మీ యింట్లో ఏమేం జేసుకున్నార్రా?"... "పాసెం, ఆ బువ్వ 6, నన్న" అని వాడు సెప్తావుంటే, "బచ్చాలో, ఓలిగలు సెయ్యలేదూ?" అని అడిగేవాడు. లేదని వాడు అడ్డంగా తలూపితే, వాడు నిజం సెప్పడం లేదన్నట్టు యింగొకన్ని అడిగేవాడు.

వాడు సరసగా "ఓలిగలు, పిత్తాన్నం..." అని సెప్పబట్టే "పాసెం జేసుకోలేదూ?" అనడిగేవాడు. "ఓలిగలూ, పాసెం జేసుకున్నోళ్ళెవరో సేతు లెత్తండ్రా!" అనేవాడు. "ఓలిగలూ, పాసెమూ ఎవురూ జేసుకోర్సార్" అని వాళ్ళు గట్టిగా అర్సి సెప్తే, "ఎందుకు జేసుకోరు? సేసుకొనేవాళ్ళను నేను సూసినా" అంటాడు. ఇంగ ఉగాది అయినాక పీర్ల పండగ. "ఈ మాంసం పండగకు మీ యింట్లో కోడి మాంసమా, పొట్టే 7 మాంసమా?" వాడు కోడి అనో, పొట్టే అనో సెప్తే... "పలావ్ సేసుకొంటారా? ఊరికే పులుసు సేసుకొంటారా? పలావ్ అయితే బాగుంటాది". "అయితే, నువు కోడి మాంసం తినొచ్చినావంటావు. తినొచ్చినట్టు మాకేం నమ్మకం? సెయ్యి వాసన సూసి సెప్తా రా". అప్పుడు కోడి సియ్యలూ, వరి బువ్వా 'కడుపు నిండా' తినొచ్చినవాని సేయి వాసన సూస్తాడు. "నిజమేరోయ్, యీడు కోడి మాంసం, బువ్వా తినొచ్చినాడు, దొంగ భడవ! సెయ్యి వాసనొస్తావుండాది" అని వాని పొట్టలో పొడ్సేవాడు నగుతానే.

ఎప్పుడడిగినా "కారెం, సంగటి తినొచ్చినా" అనే వాళ్ళను అడిగేవాడు కాదు. అందరూ పొద్దున్నే లేస్తానే మొకాలు కడుక్కోని, సద్ది అన్నంలో గడ్డ పెరుగేసి కలుపుకోని, ఊరుమిండి నంజుకోని తిని బడికొస్తే, కడుపులో సల్లగా వుంటాదని సెప్తాడు. అట్టనే మధ్యాన్నం, రాత్రికి మల్లా వరి బువ్వా పప్పులో గమ గమా వాసనొచ్చే నెయ్యేసుకోని తినాల! ఇదీ కత. ఈ కత ముప్పయేళ్ళకు ముందటిదే. ఇప్పటికీ అయ్యనగ్గిర సదువుకున్నోళ్ళు శానామందే వుండారు. వాళ్ళెవురికీ పుస్తకం పట్టుకుంటే ఆయన గ్యాపకం రాదుగానీ, బువ్వ తిని అట్ట కూకుంటే గ్యాపకం వస్తావుంటాడు. "కడుపు నిండా బువ్వ తింటివా? ఏమేం తింటివి?" అని అడుగుతాన్నట్టే వుంటాది. ●

1. సన్నబడి 2. ఊతగా 3. తలపాగా 4. పిసినారి 5. తినేశారని 6. వరి అన్నం 7. పొట్టేలు